క్లుప్తంగా

హక్కుల సాధన కోసం పోరాడుదాం



రుద్రూర్: గీత కార్మికుల హక్కుల సాధన కోసం పోరాడుదామని రాష్ట్ర గీతా పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి విఠల్‌గౌడ్ పేర్కొన్నారు. కోటగిరిలో గురువారం సంఘం 66వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సంఘ జెండాను ఎగురవేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గీత కార్మికుల కుటుంబాల కోసం నిరంతరం పోరాటాలు చేసిన ఏకైక సంఘం తెలంగాణ గీతా పనివారల సంఘమని అన్నారు. ధర్మ బిక్షం నాయకత్వంలో 1957లో సంఘాన్ని స్థాపించి కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేశారని గుర్తు చేశారు. నాయకులు వెంకట్‌గౌడ్, సురేష్‌గౌడ్, పండరిగౌడ్, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



బోధన్: తమ సమస్యల పరిష్కారం కోసం పట్టణంలో ఎన్డీఎస్ఎల్ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 76వ రోజు కొనసాగాయి. ఈసందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ.. ఫ్యాక్టరీ మూతపడి తొమ్మిదేళ్లు పూర్తికావస్తోందని, నాటి నుంచి బకాయి వేతనాలు చెల్లించకుండా యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయి వేతనాలు చెల్లించే వరకు దీక్షలు కొనసాగిస్తామన్నారు.

బీజేపీని ఆశీర్వదించండి



నవీపేట: రాబోయే ఎన్నికల్లో బీజేపీని ఆశీర్వదించి గెలిపించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాష్‌రెడ్డి ప్రజలను కోరారు. మండలంలోని మోకన్‌పల్లి, కమలాపూర్, మహంతం, లింగాపూర్, నాడాపూర్, సిరన్‌పల్లి గ్రామాల్లో గురువారం ఆయన బీజేపీ ఆధ్వర్యంలో చాయ్ పే చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. నాయకులు ద్యాగ సరిన్, రాజేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి



వర్ని: నియోజకవర్గంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం కోసం కృషి చేయాలని పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మోస్రా మండల కేంద్రంలో గురువారం ఆయన పార్టీ ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించేందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు ప్రత్యేక వ్యూహంతో ముందుకు వెళ్లాలని సూచించారు. నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, పిట్ల శ్రీరాములు, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్ వద్ద జాతీయ రహదారి 44పై గురువారం పోలీసులు ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో పోచంపాడ్ వద్ద అంతర్ జిల్లాల చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. చెక్‌పోస్టును ఆర్మూర్ ఏసీపీ జగదీష్ చందర్ తనిఖీ చేశారు. డబ్బు, అభరణాలకు సరైన పత్రాలు లేకుంటే సీజ్ చేయాలన్నారు. సీఐ గోవర్ధన్‌రెడ్డి, ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



బోధన్: పట్టణంలోని బీఆర్ఎస్ నాయకులు గురువారం రాత్రి కాంగ్రెస్ పార్టీలో చేరారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వీరికి పార్టీ నాయకుడు తూముశరత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పాషా మోహినోద్దీన్‌లు కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



అంబం (ఆర్)లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



తగిలేపల్లి గ్రామంలో..



గోవూరు గ్రామంలో..

రామ రామ రామ ఉయ్యాలో...



రుద్రూర్‌లో పంచ గౌరమ్మల బతుకమ్మ



డొంకేశ్వర్ పీహెచ్‌సీలో బతుకమ్మల వద్ద సిబ్బంది

సాక్షి నెట్‌వర్క్: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో బతుకమ్మ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా గురువారం పలు గ్రామాల్లో సద్దుల బతుకమ్మ నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. అనంతరం సాయంత్రం వేళ బతుకమ్మలనున ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసి, మహిళలు, యువతులు నృత్యాలు చేస్తూ బతుకమ్మ ఆడారు. అనంతరం బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకువెళ్లి స్థానిక చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. డొంకేశ్వర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా ఉద్యోగులు బతుకమ్మను పేర్చి ఆడిపాడారు. రుద్రూర్‌లో తెలుగు పండితులు సాదుల లక్ష్మీ నరసయ్య కుటుంబ సభ్యులు తయారు చేసిన పంచ గౌరమ్మల బతుకమ్మ విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ బతుకమ్మను తయారు చేయడానికి మూడు రోజులపాటు శ్రమించి వివిధ రకాల పువ్వులను సేకరించారు. 40కిలోల బంతిపూలు, చేమంతి, గులాబీ, గునుక, వివిధ రంగురంగు పువ్వులతో పెద్ద బతుకమ్మను తీర్చిదిద్దారు. ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత నివాసంలో ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, మహిళలు బతుకమ్మను పేర్చారు. అలాగే శ్రీరామ కాలనీ దేవి మండపం వద్ద నిర్వహించిన చండీహోమంలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో బతుకమ్మతో ఎమ్మెల్సీ కవిత



ఆర్మూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ఎడపల్లి మండలంలో..

ప్రతిష్టాత్మకంగా కార్నర్ మీటింగ్

మోర్తాడ్(బాల్కొండ): ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ శుక్రవారం మోర్తాడ్‌లో నిర్వహించనున్న కార్నర్ మీటింగ్‌నును విజయవంతం చేయడానికి కాంగ్రెస్ శ్రేణులు విశేషంగా కృషి చేస్తున్నాయి. రాహుల్ గాంధీ తొలిసారి బాల్కొండ నియోజకవర్గంలో పర్యటించనుండటంతో ఈ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారు. వచ్చే నవంబర్‌లో జరుగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల తొలి జాబితాలోనే బాల్కొండ అభ్యర్థిగా ముత్యాల సునీల్‌రెడ్డి పార్టీ అధిష్టానం ప్రకటించింది. గతంలో టిక్కెట్ల కేటాయింపు విషయంలో నాన్చుడు ధోరణి అవలంభించిన పార్టీ ఈసారి ముందస్తు ప్రణాళికతో వ్యవహరించడం విశేషం. బాల్కొండలో ఈసారి కాంగ్రెస్ అభ్యర్థి గెలిచి పార్టీకి పూర్వవైభవం తీసుకరావాలని ఆ పార్టీ నాయకులు ఆశిస్తున్నారు. తొలిజాబితాలోనే నియోజకవర్గం నుంచి పోటీచేసే అభ్యర్థి ఖరారు కావడంతో రాహుల్ సభను ఎలాగైనా విజయవంతం చేయాలని నాయకులు జనసమీకరణపై దృష్టి సారించారు. కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకును పెంచుకోవడానికి గల్ఫ్ వలస కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, రైతులను కార్నర్ సభలో భాగస్వాములుగా చేయాలని పార్టీ నాయకులు ప్రయత్నాలను మొదలు పెట్టారు. జగిత్యాల్ జిల్లా నుంచి నిజామాబాద్ జిల్లాలో కమ్మర్‌పల్లి సరిహద్దులో ప్రవేశించే రాహుల్ బస్సు యాత్రకు పెద్ద ఎత్తున స్వాగతం పలికి మోర్తాడ్‌లో నిర్వహించే కార్నర్ సభలో ప్రజలు పాల్గొనేలా నాయకులు ప్రయత్నిస్తున్నారు.

కార్నర్ మీటింగ్ స్థల పరిశీలన

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద శుక్రవారం రాహుల్‌గాంధీ నిర్వహించే కార్నర్ మీటింగ్ స్థలాన్ని గురువారం కాంగ్రెస్ నాయకులు, జాతీయ భద్రత సిబ్బంది పరిశీలించారు. మోర్తాడ్‌లో కార్నర్ మీటింగ్ అనంతరం బస్సుయాత్ర ర్యాలీగా అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకుని అక్కడ రాహుగాంధీ ప్రసంగిస్తారని నాయకులు పేర్కొన్నారు. అనంతరం ఆయన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు బయలుదేరుతారు.

రాహుల్ సభను విజయవంతం చేయండి



మోర్తాడ్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్‌లో శుక్రవారం నిర్వహించనున్న ఏఐసీసీ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ కార్నర్ మీటింగ్‌ను విజయవంతం చేయాలని మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మోర్తాడ్‌లోని ప్రజానిలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగిత్యాల్ జిల్లా నుంచి రోడ్డు మార్గంలో మోర్తాడ్‌కు బస్సుయాత్ర చేరుకుంటుందని, కార్యక్రమంలో రాహుల్ గాంధీతో పాటు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఇతర నాయకులు పాల్గొంటారని చెప్పారు. కాంగ్రెస్ అభిమానులు, రైతులు, గల్ఫ్ వలస కార్మికులు, మహిళలు అధిక సంఖ్యలో కార్నర్ సమావేశానికి తరలిరావాలని ఆయన కోరారు.

బాల్కొండ: మోర్తాడ్‌లో నిర్వహించనున్న కాంగ్రెస్ కార్నర్ సమావేశాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముత్యంరెడ్డి, డీసీసీ డెలిగెట్ జైడి రవి, డీసీసీఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

కమ్మర్‌పల్లి: టీపీసీసీ ఆధ్వర్యంలో చేపట్టిన విజయభేరీ యాత్రను విజయవంతం చేయాలని టీపీసీసీ అధికార ప్రతినిధి బి. వేణుగోపాల్‌యాదవ్ గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ యాత్రలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరవుతారని, ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

దసరా ఉత్సవాలు పాత జంబిగద్దెపై నిర్వహించాలి



తీర్మాన కాపీని మున్సిపల్ అధికారికి అందజేస్తున్న సర్వసమాజ్ కమిటీ సభ్యులు

భీమ్‌గల్: పట్టణంలో నిర్వహించే దసరా ఉత్సవాలను పాత జంబిగద్దెపై నిర్వహించాలని భీమ్‌గల్ సర్వ సమాజ్ కమిటీ సభ్యులు తీర్మానం చేశారు. ఈమేరకు బుధవారం వారు తీర్మాన కాపీని మున్సిపల్ అధికారులకు అందజేశారు. ఈసందర్భంగా సర్వసమాజ్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. భీమ్‌గల్ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ఎలాంటి మార్పులు చేయకుండా గతంలో ఎన్నికైన ప్రజాప్రతినిధులందరూ కూడా నందిగుడి వద్ద గల పాత జంబిగద్దె పైనే దసరా ఉత్సవాలు నిర్వహించారన్నారు. ప్రస్తుతం మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలత సురేందర్ ప్రజాబిష్టానికి వ్యతిరేకంగా కేవలం తన రాజకీయ గుర్తింపు కోసం దసరా ఉత్సవాలు నిర్వహించాలనే తాపత్రయంతో నూతన గద్దె నిర్మించి ప్రజల మనోభావాలు దెబ్బతినేల వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రజల కోరిక మేరకు సర్వసమాజ్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి, పాత జంబి గద్దె పైనే దసరా ఉత్సవాలు నిర్వహించడానికి తీర్మానం చేసి అమోదించినట్లు తెలిపారు.

దేవీ నారాయణీ నమోస్తుతే..



ఆర్మూర్‌లో దుర్గామాత మండపం వద్ద కంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు



నవీపేట మండల కేంద్రంలో..



మోస్రాలో పూజలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు

ఆర్మూర్‌టౌన్/వర్ని/నవీపేట: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆర్మూర్‌లోని ముదిరాజ్ సంఘంలో దుర్గామాత వద్ద మహిళలు కుంకుమార్చన నిర్వహించారు. అలాగే నవీపేటలోని దుర్గామాత మండపం వద్ద సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. మోస్రాలోని దుర్గామాత ఆలయంలో టీపీసీసీ సభ్యుడు కాసుల బాలరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గడపగడపకు కాంగ్రెస్ నాయకుల ప్రచారం



బోధన్: పట్టణంలోని పలు కాలనీల్లో గురువారం కాంగ్రెస్ నాయకులు గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ నేతలు ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పథకాలను ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ప్రజలను కోరారు. నాయకులు పాషా మోహినోద్దీన్, కౌన్సిలర్ దాము, నాయకులు తలారి నవీన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మోపాల్: నగరశివారులోని బోర్గాం(పి) గ్రామాభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడితోపాటు అన్ని కులాల నుంచి సభ్యులు ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా ఈగ శేఖర్‌రెడ్డి, సభ్యులుగా శామకూర భాస్కర్‌రెడ్డి, సందగిరి సాయిరెడ్డి, చిట్టి మోహన్, గుత్ప దశరథ్, బెండ కొండయ్య, యాదల మల్లయ్య, మేకల చందర్, కాలూరి గంగాధర్, బత్తుల రాంచందర్, కల్లెడ భాస్కర్, బాయికాడి గంగారాం, తోట శాస్త్రీ, సాయిలు, మేకల సాయి, నాగభూషణ్, బాబు మియా ఎన్నికయ్యారు. అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. 21న గ్రామంలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

తపాలా బీమాను సద్వినియోగం చేసుకోవాలి

సిరికొండ: తపాలా శాఖ అందిస్తున్న ప్రమాద బీమా సౌకర్యాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఐపీపీబీ సీనియర్ మేనేజర్ మదుమోహన్ తెలిపారు. మండలంలోని పోత్నూర్ గ్రామానికి చెందిన దారావత్ రమేష్ గతంలో విద్యుత్ ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో గురువారం మృతుడి భార్య లాలీకి రూ.10లక్షల బీమా చెక్కును తపాల శాఖ అధికారులు అందజేశారు. పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సుష్మిత బెనర్జీ, ఐపీపీబీ మేనేజర్ లక్ష్మణ్, స్నేహిత్, ఏఈవో శ్రీకాంత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అన్ని వర్గాల సంక్షేమం



చేపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న వినయ్‌రెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): కాంగ్రెస్ హయాంలోనే అన్ని వర్గాల సంక్షేమం జరిగిందని ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొద్దుటూరి వినయ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వినయ్‌రెడ్డి ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు చిన్నారెడ్డి, బద్దం రాజు, కటికె శ్రీను, కోల వెంకటేష్, అభినవ్, మురళీధర్, పోశెట్టి, శ్రీకాంత్, నవీన్, శాంతి, గంగసాయన్న తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడి ఆపాలి



ఆర్మూర్‌టౌన్: గాజా ప్రజలపై ఇజ్రాయిల్ సైనిక దాడిని ఆపాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం పట్టణంలో న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో పాలస్తీనకు మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. నాయకులు సూర్య శివాజీ, ఖాజా మొయినుద్దీన్, రవి, వెంకటేష్, గంగాధర్, సాయన్న పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



రెంజల్(బోధన్): మండలంలోని సాటాపూర్ గ్రామానికి చెందిన మస్కూరి సాయిలు కొన్ని రోజుల కిందట తన సెల్ పోగొట్టుకున్నాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు సీఈఐఆర్ పోర్టల్ సహాయం ద్వార ఫోన్ ట్రేస్ చేసి పట్టుకున్నారు. గురువారం పోలీస్‌స్టేషన్‌లో బాధితుడికి ఫోన్‌ను అందజేశారు. ఎస్సై ఉదయ్‌కుమార్, సీసీటీఎన్ఎస్ కానిస్టేబుల్ గణేశ్ ఉన్నారు.

కానిస్టేబుల్ నర్సయ్యకు ఘన నివాళి



బాల్కొండ: మెండోరామండలం చాకీర్యాల్‌కు చెందిన కానిస్టేబుల్ ఒడ్నాల నర్సయ్య 1991లో డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నక్సలైట్ల దాడిలో మృతి చెందాడు. ఈక్రమంలో గురువారం పోలీసు అమర వీరుల దినోత్సవం సందర్భంగా ఆయన నివాసంలో పోలీసులు ఘన నివాళులు అర్పించారు. ఆర్మూర్ ఏసీపీ జగదీష్ చందర్, రూరల్ సీఐ గోవర్ధన్‌రెడ్డి, ఎస్సైలు శ్రీనివాస్, గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు వేళల బోర్డు ఏర్పాటు



కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్‌లో గురువారం ఆర్టీసీ బస్సు వేళలను సూచిస్తూ బోర్డు ఏర్పాటు చేశారు. స్థానిక గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో బోర్డు ఏర్పాటు చేయడం వల్ల గ్రామస్తులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



రెంజల్(బోధన్): సాటాపూర్ గ్రామానికి చెందిన యువకులు గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి సర్పంచ్ ఎఖార్‌పాష గులాభి కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. నాయకులు రాజు, వెంకటేశ్, అరుణ్, సోమయ్య, నరేష్, శేఖర్, శివకుమార్, నాగరాజు ఉన్నారు.

పారిశుధ్య సిబ్బందికి దుస్తుల పంపిణీ



కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్ గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు గురువారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో దసరా పండుగ సందర్భంగా దుస్తులను పంపిణీ చేశారు. సర్పంచ్ అశోక్, కార్యదర్శి శ్రీనివాస్, ఉప సర్పంచ్ విక్రమ్ పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వాలు



మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

ఖలీల్‌వాడి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తూ, మళ్లీ అధికారం దక్కించుకోవడానికి యత్నిస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు పాలడుగు భాస్కర్ పేర్కొన్నారు. నగరంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో గురువారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, వైద్య రంగాలను ప్రజలకు చేరువ చేయడానికి ఎటువంటి చర్యలను చేపట్టకుండా మోసం చేయాలని ఆలోచిస్తున్నాయన్నారు. మల్యాల గోవర్ధన్ రాజీనామాను ఆమోదించారు. నాయకులు రమేష్ బాబు, పెద్దివెంకట్ రాములు, వెంకటేష్ పాల్గొన్నారు.

రోడ్డు సమస్యను పరిష్కరించండి



సిరికొండ: తమ తండాలో రోడ్డు నిర్మాణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మండలంలోని వర్షన్‌తండా ప్రజలు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం వారు హైదరాబాద్‌లో రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జెడ్పీటీసీ మా న్‌సింగ్, సర్పంచ్ సంగ్లు నాయక్, ఉపసర్పంచ్ సంతోష్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	టైగర్ నాగేశ్వరరావు(తెలుగు) - 9.40. భగవంత్‌కేసరి(తెలుగు) - 4.10 లియో(తెలుగు) - 10.30
స్క్రీన్-2 –	లియో(తెలుగు) - 11.15, 2.40, 6.05, 9.30
స్క్రీన్-3 –	భగవంత్ కేసరి (తెలుగు) - 11.55, 3.20, 6.45, 10.10
స్క్రీన్-4 –	టైగర్ నాగేశ్వరరావు (తెలుగు)-11.15, 2.50, 6.25, 10.00